సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 6 | సెప్టెంబర్ | 2024



ధర్మగుండం మూసివేత

వేములవాడ: రాజన్న ధర్మగుండంలో నీటిమట్టం పెరగడంతో మూసివేశారు. గేట్లకు తాళాలు వేసి భక్తులను అనుమతించడం లేదు. భక్తులు షవర్ల కింద స్నానాలు చేస్తున్నారు.



మిడ్‌మానేరులో 22 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటి మట్టం 22.768 టీఎంసీలకు చేరింది. అనంత గిరి ప్యాకేజీ-10కి 6,400 క్యూసెక్కులు విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజీమార్గాన్ని ప్రోత్సహించాలి

- జిల్లా జడ్జి ప్రేమలత



సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: కక్షిదారుల్లో రాజీమార్గాన్ని ప్రోత్సహించాలని జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులను ఆదేశించారు. ఈనెల 28న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు అడ్వకేట్లు, ఇన్సూరెన్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారికి రాజీపడే కేసులపై సూచనలు చేశారు. రాజీపడే కేసులు అత్యధిక సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటి, న్యాయవాదులు రమణారెడ్డి, ఎం.వి.రంగారెడ్డి, హసనుద్దీన్ పాల్గొన్నారు.

మట్టిగణపతి విగ్రహాలను పూజించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సిరిసిల్ల: పర్యావరణహితాన్ని కోరుతూ మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లాలో పంపిణీ చేసే మట్టి గణపతి విగ్రహాలను గురువారం కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వినాయకుని మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు అన్ని గ్రామాల్లోనూ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాలని కలెక్టర్ కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ భిక్షపతి మాట్లాడుతూ జిల్లాలో 2వేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. పరిశ్రమల శాఖ ఏడీ భారతి పాల్గొన్నారు.

రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం



వేములవాడఅర్బన్: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో రాజేశ్వర్ గురువారం తహసీల్ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. ఆర్డీవో రాజేశ్వర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం 2025లో భాగంగా బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే ప్రారంభమైనట్లు తెలిపారు. సర్వేలో ఫామ్ 6, 7, 8 గురించి వివరించారు. పోలింగ్ కేంద్రాల మార్పిడి, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి చర్చించినట్లు తెలిపారు. పార్టీల ప్రతినిధులు నరేందర్, నిత్యానంద రావు, హన్మండ్లు, రామస్వామి, డీటీ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.


కదిలిన వైద్యసిబ్బంది



సాక్షి ఎఫెక్ట్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలకేంద్రంతోపాటు మండలంలోని ఇతర గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్న విషయంపై 'సాక్షి'లో వచ్చిన 'గిరిజనానికి జ్వరం' కథనంపై వైద్యాధికారులు స్పందించారు. మండలకేంద్రంతోపాటు బంజేరు పరిధిలోని బీరప్పతండా, కోకియానాయక్‌తండాలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్‌ఎంలు సుజాత, కీర్తి, పంచాయతీ కార్యదర్శి రణధీర్, బ్రీడింగ్ పరిశీలకులు గోవర్ధన్, ఆశవర్కర్ అనిత, అంగన్‌వాడీ టీచర్ సుష్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు డెంగీ పరీక్షలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కిషన్‌దాస్‌పేట, అంబేడ్కర్‌నగర్ పాఠశాలలకు చెందిన 95 మంది విద్యార్థులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించినట్లు మండల వైద్యాధికారిణి స్రవంతి తెలిపారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బాలుడు మృతిచెందడంతో అప్రమత్తమై అనుమానం ఉన్న విద్యార్థులకు గురువారం డెంగీ పరీక్షలు చేయించినట్లు చెప్పారు. వైద్యులు చిరంజీవి, పీహెచ్‌ఎన్ రజనీ, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

సాదాసీదా అయ్యేనా !?

- నాలుగేళ్లుగా రైతుల నిరీక్షణ
- సాదాబైనామాలపై అన్నదాతల ఆశలు
- మార్గదర్శకాలు ఇస్తామంటున్న సర్కారు
- తాజా నిర్ణయాలతో తొలగిన సందిగ్ధం
- జిల్లాలో 15,056 మంది రైతుల నిరీక్షణ



మీసేవలో వేలిముద్ర వేస్తున్న రైతు(ఫైల్)



మూడున్నర దశాబ్దాల కిందటి సాదాబైనామా



ఇతను కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన ఎల్లాల లింగారెడ్డి. సర్వే నంబర్ 488లో 13 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశారు. ప్రభుత్వం అవకాశం కల్పించగానే 2020 అక్టోబరు 28న మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇప్పటి వరకు అతని దరఖాస్తుకు మోక్షం లభించలేదు. ధరణి రావడంతో ఆ దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉండిపోయాయి.



ఇతను వంగపల్లి పర్శరాములు. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన పర్శరాములు సర్వే నంబరు 213లో ఎకరం 15 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా చాలా రోజుల క్రితం కొన్నారు. ఇతని పేరిట భూమి మార్పిడి కాలేదు. మీసేవ కేంద్రం ద్వారా సాదాబైనామాతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయగా.. ఇప్పటి వరకు పరిష్కారం చూపలేదు. ఇలా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 15వేల మంది రైతులు సాదాబైనామాలకు దరఖాస్తులు చేసి నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారు.



మీసేవ కేంద్రం రశీదు

సిరిసిల్ల: సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములకు దరఖాస్తు చేసుకున్న రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాక పరిష్కారం కావడం లేదు. 2020 అక్టోబరు 19న మరోసారి సాదాబైనామాలకు అవకాశం కల్పించగా.. అక్టోబర్ 31తో గడువు ముగిసింది. అయినా ప్రభుత్వం నవంబరు 10 వరకు పొడగించింది. దీంతో జిల్లాలో 15056 మంది రైతులు సాదాబైనామాలు పరిష్కరించాలని మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి ఇప్పుడు అమలులో ఉన్న రెవెన్యూ చట్టంలో సాదాబైనామాల ఊసే లేదు. సాదాబైనామాలు ఉన్నా.. రికార్డుల్లో మార్పులు, చేర్పులు వీలు కాదు. పాత రెవెన్యూ చట్టం ప్రకారం సాదాబైనామాలతో హక్కులు కల్పించే అవకాశం ఉంది.

సర్కారు నిర్ణయంపై ఆశలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాదాబైనామాలకు అవకాశం కల్పిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గతంలో చేసుకున్న దరఖాస్తులతోపాటు కొత్తగా మళ్లీ దరఖాస్తులకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తే సాదాబైనామాలకు మోక్షం లభించనుంది.

దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తులు
కోనరావుపేట	2,690
రుద్రంగి	162
వీర్నపల్లి	379
బోయినపల్లి	764
చందుర్తి	1,259
గంభీరావుపేట	1,403
ఇల్లంతకుంట	1,536
ముస్తాబాద్	1,685
సిరిసిల్ల	428
తంగళ్లపల్లి	1,776
వేములవాడ	675
వేములవాడరూరల్	1,072
ఎల్లారెడ్డిపేట	1,227

నాలుగేళ్ల కిందట ఆన్‌లైన్ కష్టాలు

సాదాబైనామాల అమలుకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేశారు. భూమి అమ్మిన వ్యక్తి వివరాలతోపాటు కొనుగోలు చేసిన వారి సమాచారం, సర్వే నంబరు, ఆధార్‌కార్డు నంబర్, ఫొటో, ఫింగర్‌ప్రింట్ లేదా ఐరిష్ నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. గ్రామకంఠం స్థలాలకు సర్వే నంబరు లేక ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ధరణి పోర్టల్‌లో కొన్ని సర్వేనంబర్లు నమోదుకాలేదు. దీంతో సాదాబైనామాపత్రం ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆన్‌లైన్‌లో నమోదుచేసిన వారు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు.

మార్గదర్శకాలు జారీకావాల్సి ఉంది



సాదాబైనామాల అమలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. అన్ని మండలాల నుంచి మీసేవ ఆన్‌లైన్‌లో అప్పట్లో దరఖాస్తు చేశారు. గైడ్‌లైన్స్ వస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ప్రభుత్వం నుంచి సాదాబైనామాలపై స్పష్టమైన ఆదేశాలు వస్తే క్షేత్రస్థాయిలో అమలు చేసే అవకాశం ఉంది. రెవెన్యూశాఖ మంత్రి ఇటీవల ఈ అంశాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది.

– ఎన్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- సిరిసిల్ల ఆలయ ఈవో మారుతీరావు

సిరిసిల్లటౌన్: శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 9 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీరావు గురువారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 19 వరకు జరిగే ఉత్సవాలలో శ్రీవారి ప్రసాదం విక్రయానికి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి ప్రసాదం లడ్డూ, పులిహోర విక్రయాలు, కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు ఈనెల 20న మధ్యాహ్నం 12 గంటలకు ఆలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లడ్డూ, పులిహోరకు రూ.10వేలు, కొబ్బరి ముక్కలకు రూ.10వేలు ధరావత్తు మొత్తాన్ని ఏదేని జాతీయ బ్యాంకులో కార్యనిర్వహణాధికారి, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, సిరిసిల్ల పేరున డీడీ తీసి దరఖాస్తు పత్రానికి జతచేసి ఆలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలని సూచించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం



ఉత్తమ ఉపాధ్యాయులతో విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, డీఈవో రమేశ్‌కుమార్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సిరిసిల్ల: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం స్కూళ్ల బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఖాళీల భర్తీకి ఇటీవల 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించిందని గుర్తు చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఎందరో రాష్ట్రపతి, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. జిల్లా నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయిలకు ఎంపికైన తాడూరి సంపత్‌కుమార్, పాకాల శంకర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తన బాల్యం నుంచి ఈ స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దిన టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జీసీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన ఉపాధ్యాయులు వీరే..

- **ప్రధానోపాధ్యాయులు:** బి. సదానందం (కోనాయిపల్లి), జి.కృష్ణహరి(రాచర్ల తిమ్మాపూర్)
- **స్కూల్ అసిస్టెంట్లు:** బి.గోవిందరావు(సిరిసిల్ల), డి.రాజిరెడ్డి(లింగన్నపేట), కె.రవి(చంద్రంపేట), వి.వసుంధర(విలాసాగర్), డి.శరత్‌కుమార్(వట్టెంల), ఎస్.నీరజ(కోనాయిపల్లి), పి.రామచందర్‌రావు(మండెపల్లి), ఎం.లక్ష్మీనారాయణ(ఆవునూర్), కె.రవి(గంభీరావుపేట ఉర్దూ మీడియం)
- **ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు:** ఆర్.రాజు (బాబాజీనగర్)
- **ఫిజికల్ డైరెక్టర్లు:** పి.ప్రభాకర్(విలాసాగర్), టి.సురేష్(గీతానగర్)
- **ఎస్‌జీటీలు:** కె.శోభారాణి(ఎల్లారెడ్డిపేట), డి.లచ్చిరెడ్డి(రంగంపేట), జి.శంకరయ్య (బాబాజీనగర్), ఎ.మధు(కనగర్తి), కె.ఎల్లారెడ్డి(సింగారం)
- **కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం:** ఎస్.శారద(తంగళ్లపల్లి), కె.పద్మ(వీర్నపల్లి), ఎ.మధులత(వేములవాడ అర్బన్), కె.అర్చన(ఇల్లంతకుంట)
- **తెలంగాణ మోడల్ స్కూల్స్:** కె.కొండల్‌రావు (కోనరావుపేట), బి.బాబు(ఇల్లంతకుంట)
- **తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ:** డి.మంజుల(నేరెళ్ల)

ఘనంగా తీజ్ సంబరాలు



సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: గిరిజన సంస్కృతి ప్రతీక తీజ్ పండుగ వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం నర్సయ్య అతిథిలుగా హాజరయ్యారు. గోధుమ నారును గిరిజన మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, మాజీ జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, పద్మ, భూక్య గజన్‌లాల్, లకావత్ రాంరెడ్డి, భూక్య వినోద్‌నాయక్, మాలోత్ జేత్యనాయక్, అజ్మీరా రఘుపతినాయక్, ఇస్లావత్ దేవిసింగ్‌నాయక్, లకావత్ తులసీరాంనాయక్, భూక్య తిరుపతినాయక్, కేపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు



ఇది ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్–సింగారం గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద తీవ్రంగా రావడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి గుండానే సిద్దిపేట, హైదరాబాద్, దుబ్బాక పట్టణాలకు రాకపోకలు కొనసాగిస్తారు. ప్రస్తుతం రోడ్డు కోతకు గురికావడంతో పెద్దవాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది.



ఇది ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల మధ్య రాకపోకలకు వారధి. మానేరువాగుపై పదిర గ్రామ శివారులో ఉంది. తరచూ వరదలు వస్తుండడంతో ప్రతీ సారి ఈ రోడ్డు తెగిపోతూనే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదలతో ఈ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రెండు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతోపాటు రోడ్డు కనిపించకుండా వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది.



ఈ తెగిన రోడ్డు ఇల్లంతకుంట మండలం జవారిపేట–నర్సక్కపేట గ్రామాల మధ్య ఉంది. ఈ రోడ్డు తెగిపోవడంతో పారువెల్ల, నర్సక్కపేట గ్రామస్తులకు దూరభారంగా మారుతుంది. కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాసింపేటలోని మానసదేవి ఆలయానికి వెళ్లేందుకు ఈ ప్రాంత మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

ఇది కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల మధ్య రాజన్నసిరిసిల్ల జిల్లా మీదుగా రాకపోకలకు ప్రధాన రహదారి. ఈ రోడ్డుపై గంభీరావుపేట శివారులో ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దాని పక్కనే టెంపరరీ రోడ్డు వేశారు. అయితే ఎగువమానేరు పొంగుతుండడంతో వచ్చిన వరదకు తాత్కాలిక రోడ్డు తెగిపోయి రెండు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



- వర్షానికి ధ్వంసమైన లోలెవల్ వంతెనలు
- పల్లెలకు తెగిపోయిన బంధాలు
- దూరభారమైన ప్రయాణం
- శాశ్వత పరిష్కారం లేక పరేషాన్
- నెలల తరబడి ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో రోడ్లు తెగిపోతూనే ఉన్నాయి. నెలల తరబడి జిల్లాలు, మండలాలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. దశాబ్దాల కాలంగా ఈ పరిస్థితులు ఉన్నా శాశ్వత పరిష్కారం చూపడంలో పాలకులు విఫలమవుతూనే ఉన్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, ఇల్లంతకుంట, రుద్రంగి మండలాల్లో పల్లెలకు వర్షాకాలంలో రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఫలితంగా పల్లెప్రజలు నెలల తరబడి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. అంతేకాకుండా అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

స్తంభించిన ప్రయాణం

- ఇల్లంతకుంట మండలం జవారిపేట–నర్సక్కపేట మధ్య బిక్కవాగుపై రోడ్డు తెగిపోయింది. తాళ్లపల్లి–గూడెం గ్రామాల మధ్య బర్రెవాగుపై రోడ్డు ధ్వంసమైంది.
- కోనరావుపేట మండలం మామిడిపల్లి–నిజామాబాద్, బావుసాయిపేట–వెంకట్రావుపేట, వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై వంతెనలు తెగిపోయాయి.
- గంభీరావుపేట మండలం గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరువాగుపై ఉన్న హైలెవల్ వంతెన నిర్మిస్తుండగా, సమీపంలోనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది.
- ఎల్లారెడ్డిపేట మండలం పదిర–రామలక్ష్మణులపల్లి మధ్య మానేరువాగుపై లోలెవల్ వంతెన తెగిపోయింది. నారాయణపూర్–సింగారం గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది.
- వీర్నపల్లి మండలం శంకర్‌నాయక్‌తండా గ్రామ శివారులో రోడ్డు తెగిపోయింది. దీంతో తండాకు మండల కేంద్రానికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం

జిల్లా వ్యాప్తంగా వర్షాకాలంలో తెగిపోతున్న రోడ్లు, వంతెనల స్థానంలో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. లోలెవల్ వంతెనల స్థానాల్లో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణాలకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ఏటా ఇవే ఇబ్బందులు



వర్షాకాలంలో ఏటా వరదకు రోడ్లు తెగిపోతూనే ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వతంగా పరిష్కారం చూపడం లేదు. ప్రస్తుతం తెగిపోయిన రోడ్డుపై రాత్రి వెళ్లాలంటే భయంగా ఉంది. కొత్త వారు ఇటు వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

– గొరిటీపల్లి జితేందర్, బండలింగంపల్లి

వంతెన నిర్మించాలి



పదిర–రామలక్ష్మణులపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై ప్రస్తుతం లోలెవల్ వంతెనతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ వర్షాకాలంలో లోలెవల్ వంతెన మునిగిపోవడంతోపాటు, ఆ రోడ్డు కోతకు గురవుతుంది. ఒక్కోసారి వర్షాకాలం సీజన్ మొత్తం రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు అవతల ఉన్న పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి.

– చల్లా సత్యంరెడ్డి, పదిర

ప్రతిపాదనలు పంపిస్తాం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో తెగిన రోడ్లు, మునిగిన లోలెవల్ వంతెనల పరిస్థితులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. కొన్ని చోట్ల తెగిన రోడ్లను మరమ్మతు చేయడానికి అయ్యే ఖర్చు అంచనా వేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మరమ్మతులు చేస్తాం.

– కిరణ్, ఆర్‌అండ్‌బీ, ఏఈ

క్లుప్తంగా

క్యూలైన్‌లో రాజన్న భక్తురాలి మృతి

- మృతురాలు సిద్దిపేట జిల్లావాసి


విజయ (ఫైల్)

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు క్యూలైన్‌లోనే కుప్పకూలి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని చోటపల్లికి చెందిన కొత్తకొండ విజయ (50) గురువారం కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చింది. రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తుండగా ఒక్కసారిగా కిందపడింది. స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోందని కుటుంబసభ్యులు తెలిపారు. విజయ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

డెంగీతో వ్యక్తి మృతి

రుద్రంగి(వేములవాడ): డెంగీతో బాధ పడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి(60) మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రవి 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అయితే, ఓ ప్రైవేటు వైద్యుడు ఇంజెక్షన్ వేయడం వల్ల సెప్టిక్ అయిందని, మరో వైద్యుడు సెప్టిక్ అయిన చోట చీరడంతో రక్తస్రావమై రవి చనిపోయాడని స్థానికంగా చర్చ జరిగింది. ఈ విషయమై రుద్రంగి ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌కు తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాను పెంచుకుంటున్న గేదె రోడ్డు దాటుతుండగా.. వేగంగా గొల్లపల్లి వైపు వెళ్తున్న ఆటో గెదెను ఢీకొట్టింది. గేదెను తాడుతో తన చేతులకు కట్టుకోగా, ఈ ప్రమాదంలో గెదెకు కట్టిన తాడుతో నాగరాజు దూరంగా ఎగిరిపడ్డాడు. ప్రమాదంలో నాగరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ ప్రమాదంలో నాగరాజుతోపాటు గెదె కూడా గాయపడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరొకరికి గాయాలు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో అతను అపస్మారకస్థితికి చేరడంతో ఆచూకీ తెలియడం ఇబ్బందిగా మారింది. పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ కోసం తెలుసుకుంటున్నారు.

డబ్బులు ఇవ్వట్లే.. తలనీలాలు పోగుచేసుకోవట్లే

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న తలనీలాలు
- స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఆరబెట్టిన రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆలయ అధికారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. 4 నెలలుగా సదరు కాంట్రాక్టర్ ఆలయానికి డబ్బులు చెల్లించకపోవడమే కాకుండా కల్యాణకట్టలోని తలనీలాలను పోగుచేసుకోవడం లేదు. దీంతో అవి పేరుకుపోతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలకు తలనీలాలు పాడవుతాయని అధికారులు భావించారు. గురువారం సదరు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తుల సమక్షంలో రాష్ట్ర దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(కరీంనగర్) సత్యనారాయణ పర్యవేక్షణలో స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఫ్యాన్ల కింద వాటిని ఆరబెట్టారు. ఆలయ ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకుడు నర్సయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, ఎస్పీఎఫ్ బందోబస్తు మధ్య ఈ కార్యక్రమం చేపట్టారు.


స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో ఆరబెట్టిన తలనీలాలు

చెక్కులు బౌన్స్.. కాంట్రాక్టర్‌కు నోటీసులు

వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసుకునే హక్కు కోసం ఆలయ అధికారులు రెండేళ్లకోసారి టెండర్లు పిలుస్తుంటారు. 2023–25 సంవత్సరానికి గానూ టెండర్ పిలవగా రూ.19.08 కోట్లకు సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ హిందూపూర్ దక్కించుకుంది. అయితే, సదరు కాంట్రాక్టర్ ఆలయానికి రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆయన ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా, ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టర్‌తోపాటు ఆలయ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సమక్షంలోనే తలనీలాలను ఓపెన్ స్లాబ్‌లోకి తరలించి, సాయంత్రం వరకు ఆరబెట్టారు. తర్వాత వాటిని 55 బ్యాగుల్లో నింపి, స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

వేములవాడలోనూ సదెరం శిబిరాలు


సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: సిరిసిల్లతోపాటు వేములవాడలోనూ దివ్యాంగుల వైకల్య పరీక్షల సదెరం శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం డీఆర్‌డీవో, సంక్షేమ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సదెరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు నిర్దేశిత సమయానికి రావాలన్నారు. జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం సిరిసిల్ల జనరల్ ఆస్పత్రితో పాటు, వేములవాడ ప్రాంతీయ వైద్యశాలలోనూ వైకల్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 10, 13, 18, 20వ తేదీల్లో ఆర్థో(ఎముకల) వైద్యపరీక్షలు జరుగుతాయని, 24న కంటి వైద్యపరీక్షలు, 27న వినికిడి, మానసిక అనారోగ్య సమస్యల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిరిసిల్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వేములవాడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి వసంతరావు, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రుల పర్యవేక్షకులు డాక్టర్ లక్ష్మీరాజం, డాక్టర్ పెంచలయ్య, ఆర్ఎంవో డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న శంకర్‌గౌడ్



సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేతుల మీదుగా పాకాల శంకర్‌గౌడ్ అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తిపై సైబర్ కేసు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లికి చెందిన ఎరుకల కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కిషన్‌కు తెలిసిన వ్యక్తి ద్వారా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, అతని బ్యాంకు కరెంట్ అకౌంట్ బుక్, సిమ్‌కార్డు తీసుకున్నాడు. వాటి నుంచి కిషన్‌కు తెలియకుండా లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ఇది గుర్తించిన బాధితుడు తన ఖాతా నుంచి పెద్ద మొత్తంలో లావాదేవీలు చేస్తున్నాడని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆ గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఈ విషయంలో కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉందన్న సమాచారంతో అతన్ని అదుపులోకి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట: సీసీ కెమెరాలతోనే నేరాలను నియంత్రించవచ్చని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొలనూర్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ఏదైనా సంఘటన జరిగితే సీసీ కెమెరాలతో నిందితులను గుర్తించవచ్చన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, నాయకులు సంకినేని నిరంజన్‌రావు, తిరుపతియాదవ్, సతీశ్, ముత్తయ్య, అరవింద్, మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

చిన్ని గుండెల శస్త్రచికిత్సకు ఎంపిక



సిరిసిల్లటౌన్: ఆర్‌బీఎస్‌కే టీమ్‌ల ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంపుల్లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 18 ఏళ్ల లోపు ఉన్న 36 మంది చిన్నారులను గుర్తించారు. వీరిని గురువారం డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్ (డీఈఐసీ)లో అపోలో ఆస్పత్రి నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులతో పరీక్షలు చేయించారు. 18 మందికి శస్త్రచికిత్సలు అవసరం ఉండగా..హైదరాబాద్ అపోలో ఆ స్పత్రికి రెఫర్ చేశారు. మిగతా పిల్లలకు ఏడాది పాటు మందులు అందించారు. ప్రోగ్రాం ఆఫీసర్ నయీమ్ జోహాన్ ఉన్నారు.

పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుకు కృషి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుకు కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కృషిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ పేర్కొన్నారు. సిరిసిల్లలో గురువారం మీడియాతో మాట్లాడారు. పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుపై అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీని నిలుపుకుంటుందని స్పష్టం చేశారు. ఈమేరకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. నేతన్నల బకాయిల చెల్లింపు కోసం సంజయ్ దీక్షకు సిద్ధపడితేనే అధికార పార్టీలో కదలిక వచ్చిందన్నారు. టెక్స్‌టైల్‌పార్కును సిరిసిల్లకు కేటాయించింది ఎన్‌డీఏ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఒకవైపు కాంగ్రెస్ సర్కారుపై నేతన్నల సమస్యలపై పోరాడుతూనే.. మరోవైపు పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ శివారులో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఇద్దరు యువకులు బైక్‌పై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని, విచారించగా గంగాధర మండల కేంద్రానికి చెందిన కొడిమ్యాల అఖిల్, షేక్ ఖాసీం అని, గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు తేలింది. గంగాధర మండలంలోని కాశిరెడ్డిపల్లికి చెందిన మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, వారు కొంత తాగుతూ.. మిగతాది సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. బైక్‌తోపాటు, 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు



ఇల్లంతకుంట(మానకొండూర్): అన్నపూర్ణ ప్రాజెక్టులోకి మిడ్‌మానేరు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. అన్నపూర్ణలో ప్రస్తుతం 2.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు డీఈ దేవేందర్ తెలిపారు. మిడ్‌మానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీరు వస్తుందని, ప్రాజెక్టు నుంచి రంగనాయక్‌సాగర్‌లోకి 6,600 క్యూసెక్కుల నీరు వెళ్తుందని తెలిపారు.

మృగాడిని ఉరితీయాలి



సిరిసిల్లటౌన్: ఆసిఫాబాద్ జిల్లాలో గోండు మహిళపై అత్యాచార, హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఉరివేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మీయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టి మాట్లాడారు. నిరుపేద గోండు మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం చేసిన నిందితుడు షేక్ ముగ్దూమ్‌ను శిక్షించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు గాజుల వేణు, పండుగ మాధవి, గాజుల రాంప్రసాద్, రమేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ నందికామన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ మున్సిపల్ పరిధి శాలరామన్నపల్లెకు చెందిన కదురు నరేశ్, తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన హర్షవర్ధన్(13) బైక్‌పై నందికమాన్ వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లోకి వెళ్తుండగా కారు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: భారతీయ రిజర్వ్‌బ్యాంక్ స్థాపించి 90 ఏళ్లయిన సందర్భంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్‌పోటీలు నిర్వహించనున్నామని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎన్.మల్లికార్జున్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ, జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు రూ.లక్ష నుంచి రూ.10లక్షల విలువైన బహుమతులు అందించే అవకాశం ఉందన్నా రు. ఏదైనా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ప్రథమ బహుమతి రూ.10 లక్షలు, రెండో బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతిగా రూ.6లక్షలు అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు rbi90quiz.in లో సంప్రదించాలన్నారు.

చందుర్తి జూనియర్ కళాశాల తనిఖీ



చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లిన లెక్చరర్ల బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. లెక్చరర్ల హాజరుపట్టిక, రికార్డులు తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణాకర్ తదితరులు ఉన్నారు.

చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లా అంతటా గురువారం చిరుజల్లులు కురిశాయి. అత్యధికంగా బోయినపల్లిలో 10.2 మిల్లీమీటర్ల వర్షం పడగా.. చందుర్తిలో 7.1, రుద్రంగిలో 2.4, వేములవాడరూరల్‌లో 6.7, సిరిసిల్లలో 2.6, వేములవాడలో 5.9, కోనరావుపేటలో 1.4, ఎల్లారెడ్డిపేటలో 1.7, ముస్తాబాద్‌లో 4.2, వీర్నపల్లిలో 1.4, గంభీరావుపేటలో 0.8, తంగళ్లపల్లిలో 2.6, ఇల్లంతకుంటలో 2.1 మి.మీ. వర్షం కురిసింది.


వాహనాల్లోకి ఎక్కిస్తున్న చేపల బాక్సులు

చేపలవేట.. ఉపాధి బాట

- మిడ్‌మానేరులో మత్స్యసిరులు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మత్స్యకారులు
- హైదరాబాద్ మార్కెట్‌కు తరలింపు
- నిత్యం టన్నుల్లో వ్యాపారం

వేములవాడఅర్బన్: ఎక్కడ కోల్పోయారో.. అక్కడే వెతుక్కోవాలన్న.. పెద్దల మాటను నిజం చేస్తున్నారు మిడ్‌మానేరు నిర్వాసితులు. మధ్యమానేరు నిర్మాణంతో సర్వం కోల్పోయి పునరావాస గ్రామాలకు తరలిన మత్స్యకారులు అదే ప్రాజెక్టును ఉపాధికి నిలయంగా మార్చుకున్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో పుష్కలంగా లభించే చేపలు పడుతూ.. ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. నిత్యం సూర్యోదయానికి ముందే మిడ్‌మానేరులోకి చేపల వేటకు దిగి.. హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మత్స్యకారులు తెచ్చే చేపలు కొంటూ మరికొందరు స్థానికులు వ్యాపారులుగా స్థిరపడ్డారు. నిత్యం టన్నుల కొద్ది చేపలు మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసర గ్రామాల నుంచి హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు వెళ్తున్నాయి.

చేపలు పట్టేందుకు లైసెన్స్‌లు

మిడ్‌మానేరు ప్రాజెక్ట్ చుట్టూ సుమారు 10 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లోని మత్స్యకారులకు మాత్రమే ఈ ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు లైసెన్స్‌లు ఉన్నాయి. ఇలా దాదాపు 1500 మంది లైసెన్స్‌లు పొందారు. వీరు నిత్యం చేపలు పట్టి అక్కడే విక్రయిస్తుంటారు. కొందరు దుకాణదారులు వీరి వద్ద కొని వినియోగదారులకు విక్రయిస్తుంటారు. ఇలాంటి దుకాణాలు నాంపల్లి, సంకెపల్లి, అనుపురం, రుద్రవరం, కొడుముంజ, నందికమాన్, కొదురుపాక, కందికట్కూర్ గ్రామాల వద్ద 50 వరకు వెలిశాయి.

ప్రమాదమని తెలిసినా..

మత్స్యకారులు గతంలో తమ గ్రామాల్లో వ్యవసాయం, ఇతరత్ర కూలీ పనులు చేసుకుని జీవించేవారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఆయా గ్రామాలు ముంపునకు గురికావడంతో ఉపాధి లేకుండా పోయింది. దీంతో మత్స్యకారులు మిడ్‌మానేరులో చేపలవేటనే ఉపాధిగా ఎంచుకున్నారు. మిడ్‌మానేరులో ఎటూ చూసిన తెప్పలపై వెళ్లి వలలు వేసి చేపలు పడుతుండడం కనిపిస్తుంటుంది. ఈక్రమంలో గాలికి తెప్పలు పడిపోవడం, నీటిలో విషపురుగులు కుట్టడం వంటివి జరుగుతున్నాయి. చేపల వేటకు వచ్చే వారు సురక్షితంగా ఇంటికి చేరే వరకు కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తూనే ఉంటారు.


చేపలు తూకం వేస్తున్న మత్స్యకారులు

సబ్సిడీ పథకాలు అందించాలి

మత్స్యకారులకు చేపలవేటకు అవసరమయ్యే వలలు, ద్విచక్ర వాహనాలు, గూడ్స్ వాహనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి సబ్సిడీ పథకాలు వర్తింపజేయాలని కోరుతున్నారు. అలాగే తమకు బీమా పథకాలు కూడా ప్రభుత్వమే అమలు చేయాలంటున్నారు.

సబ్సిడీ పథకాలు అందివ్వాలి



చేపల వేటనే జీవనాధారంగా బతుకుతున్నాం. నిత్యం చేపలను పట్టి కుటుంబాలను పోషించుకుంటున్నాము. ప్రభుత్వం మత్స్యకారులను దృష్టిలో ఉంచుకుని సబ్సిడీ వాహనాలు అందించాలి.

– భగవాన్, నాంపల్లి

ఇంటికొచ్చేదాకా భయమే..



మిడ్‌మానేరులోకి చేపల వేటకు వెళ్లే ఇంటికొచ్చే వరకు భయంగా ఉంటుంది. నీటిలోకి వెళ్లిన తర్వాత గాలి, వర్షం వస్తే ప్రమాదకరంగా ఉంటుంది. నీటిలో విషపురుగులతో భయంగా ఉంటుంది. ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

– పర్శరాములు, నాంపల్లి

హైదరాబాద్‌కు పంపిస్తా



నేను చిన్నతనం నుంచి చేపలవేటకు వెళ్లేవాడిని. ప్రస్తుతం మిడ్‌మానేరులో చేపలను పడుతున్నప్పటి నుంచి ఇక్కడి చిన్నదుకాణం పెట్టి చేపలను కొనుగోలు చేస్తున్నాను. ఇక్కడి నుంచి హైదరాబాద్, కరీంనగర్ పట్టణాలకు చేపలను పంపిస్తాను.

– కొమురయ్య, దుకాణాదారుడు, గొల్లపల్లి



వేములవాడ: కల్యాణకట్ట అపరిశుభ్రంగా మారిందని సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్పందించి తలనీలాలను సంచుల్లో నింపించారు. అయినా తలనీలాలు నింపిన సంచులతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని మళ్లీ సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించి ఆ బస్తాలను ప్రత్యేక గదిలోకి తరలించారు.

సెల్లార్‌లోని షట్టర్లు కూల్చివేత

- సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దుకాణ సముదాయంపై చర్యలు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చేదు అనుభవం ఎదురైంది. సిరిసిల్ల గోపాల్‌నగర్‌లో ఆయనకు దుకాణ సముదాయం ఉంది. అందులోని సెల్లార్‌లో షట్టర్లు నిర్మించారు. ఈ విషయం కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పలుమార్లు స్థానిక అధికారులకు, వరంగల్ ఆర్‌జేడీలోనూ ఫిర్యాదు చేశారు. అయినా స్పందన కరువైంది. దీంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలు కూల్చివేయాలని ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు వైస్ చైర్మన్‌కు నోటీసులు అందించినా ఆయన స్పందించలేదు. దీంతో బల్దియా అధికారులే స్వయంగా రంగంలోకి దిగి, గురువారం సదరు కాంప్లెక్స్ సెల్లార్‌లోని షట్టర్లను కూల్చివేశారు.


షట్టర్లను కూల్చివేస్తున్న జేసీబీ

పూర్తిస్థాయిలో కూల్చాలి

గోపాల్‌నగర్‌లోని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చెందిన దుకాణ సముదాయంలోని సెల్లార్ షట్టర్లను పాక్షికంగా కూల్చివేశారు. నిబంధనలకు మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చాల్సి ఉంది. కోర్టు ఆర్డర్‌ను సైతం మున్సిపల్ అధికారులు బేఖాతర్ చేస్తున్నట్లు భావిస్తున్నాం. అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కాకుండా పూర్తిస్థాయిలో కూల్చాలి. లేని పక్షంలో మళ్లీ కోర్టుకు వెళ్తాం.

– నాగుల శ్రీనివాస్, బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు

సోషల్‌మీడియాపై నిఘా

సిరిసిల్లక్రైం: మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు పోస్ట్ చేయొద్దని, అసత్య ప్రచారాలను ఫార్వర్డ్ చేయొద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో మతవిద్వేషాలకు సంబంధించిన ఫేక్ మెసేజ్‌లు, వీడియోలు పోస్టు చేయడం నేరమని స్పష్టం చేశారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే మెసేజ్‌లు ఫార్వర్డ్ చేసిన వారితోపాటు గ్రూప్ అడ్మిన్‌లపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూలీరేట్లు పెంచాలి

- ప్రభుత్వ విప్‌కు హమాలీ సంఘం నాయకుల విన్నపం

సిరిసిల్లఅర్బన్: హమాలీల కూలీ రేట్లను పెంచి, బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయీస్ హమాలీ సంఘం కార్మికులు ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గురువారం వినతి పత్రం అందించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లను క్వింటాల్‌కు రూ.25 నుంచి రూ.35కు పెంచాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి రాములు, పండుగ పోచమల్లు, చంద్రయ్య పాల్గొన్నారు.